## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌గౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేషనల్ హైవే రోడ్డు మరమ్మతు, 33 కేవీ లైన్ పరిధిలో ఉన్న చెట్ల కొమ్మల తొలగిస్తునట్లు పేర్కొన్నారు. పెద్దకొత్తపల్లి, దేవల్‌తిరుమలాపూర్, పెద్దకార్పాముల, దేవినేనిపల్లి, యాపట్ల, జొన్నలబొగుడ, చిన్నకార్పాముల, చిన్నికొత్తపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు.

### చదువుతోనే ఉజ్వల భవిష్యత్



కల్వకుర్తిరూరల్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని క్లాస్‌మేట్ క్లబ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్మిచర్ల రమేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో 10వ తరగతిలో ఫలితాల్లో 10/10 జీపీఏ సాధించిన 15 విద్యార్థులకు క్లబ్ ఆధ్వర్యంలో సర్టిఫికేట్, మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ బాగా చదివి ఉన్నతస్థానంలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో లక్ష్మీనర్సింహారావు, శోభన్‌బాబు, శ్రీధర్, కృష్ణయ్య, సంపత్ కుమార్, కిషన్, ప్రకాష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ఖోఖో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



నాగర్‌కర్నూల్‌రూరల్: నాగర్‌కర్నూల్ మండలంలోని పెద్దముద్దునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఖోఖో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. సీనియర్ క్రీడాకారులు మల్లేష్, అంజీలు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శివచారి, భాస్కర్, ఆంజనేయులు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



కొల్లాపూర్: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో ఇటీవల అనారోగ్యంతో కర్నె శివాజీ మృతి చెందాడు. యువ సంకల్ప స్వచ్ఛంద సంస్థ సభ్యులు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.11,300 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు చంద్రకాంత్, అధ్యక్షుడు బిజ్జ మధుసూదన్, ప్రధాన కార్యదర్శి మూలె రమేష్, బండి ఆనంద్, చెన్నకేశవులు, అవుట స్వామి, శివ, నీలస్వామి, నవీన్, గుడిపాటి శివ, మురళీధర్ తదితరులు ఉన్నారు.

### నిందితుడికి రిమాండ్

చారకొండ: మండల కేంద్రంలో వారం రోజుల కిందట ప్రధాన రహదారిపై ఎస్‌ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. దేవరకొండ మండలం పద్మట్‌పల్లికి చెందిన బాలరాజు మద్యం తాగి పట్టుబడ్డాడు. అతడిని శుక్రవారం కల్వకుర్తి కోర్టులో కానిస్టేబుల్ సురేష్ గౌడ్ హాజరుపరచగా జ్యూడిషయల్ మేజిస్ట్రేట్ కావ్య వారికి రెండు రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

### మాదిగల సత్తాచాటుదాం



అచ్చంపేట రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో మూడు లక్షల మందికి పైగా మాదిగలు ఉన్నారని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తమ సత్తా చాటుదామని మాదిగ రాజకీయ ఐక్యవేదిక జిల్లా చైర్మన్ విజయ్, శంకర్‌మాదిగ అన్నారు. ఈనెల 5న అచ్చంపేటలోని బీకే ప్యాలస్ ఫంక్షన్ హాలులో నిర్వహించే సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శంకర్ మాదిగ, ప్రదీప్, మల్లయ్య, వినోద్, అశోక్, కర్ణాకర్, నాగరాజు, తిరుపతయ్య, కళ్యాణ్, విజయ్, శివ, నరేష్, మల్లేష్, అనీల్ పాల్గొన్నారు.

# అడుగంటిన భూగర్భ జలాలు

- ఎండిన కేఎల్ఐ కాల్వలు



అల్లాపూర్ శివారులో వాడిపోయిన వేరుశనగ



గుంతకోడూరు శివారులో నీరు లేని కేఎల్ఐ కాల్వ

తాడూరు: మండలంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. రోజురోజుకు తగ్గిపోతున్న నీటి మట్టాలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వానాకాలం అంతంత మాత్రంగా వర్షాలు కురవడం, ఎండల తీవ్రతరం కావడంతో బోరుబావులలో నీరు ఇంకిపోతున్నాయి. సాగుచేసిన పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. యాసంగిలో పంటలు సాగుచేసిన అన్నదాతల పరిస్థితి అగమ్యగోచారంగా తయారైంది. చెరువుకుంటలలో నీరు తగ్గిపోవడం, కేఎల్ఐ కాల్వలు ఎండిపోవడం వల్ల భూగర్భ జలాలు పాతాళంలోకి వెళ్లాయి. ఎంతో ఆశతో రైతులు యాసంగిలో సాగుచేసిన పంటల పరిస్థితి పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయి. మండలంలో చెరువు, కుంటలలో నీరు తగ్గడం, పంటలను కాపాడుకోవడం కోసం రైతులు వేసుకుంటున్న బోర్లలో ఆశించిన నీరు రాకపోవడంతో పంటల దిగుబడిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న కొంతవరకు చేతికి వచ్చినప్పటికి వేరుశనగ ఆరుతడి పంటలకు నీరు లేక రైతులు అల్లాడిపోతున్నారు. గతేడాదితో పోల్చితే ప్రస్తుతం నీటి శాతం తక్కువై బోరులలో పుష్కలంగా నీరు రావడం లేదు. గత 10 ఏళ్లలో ఇటువంటి దుస్థితి ఎప్పుడు చూడలేదని రైతులు వాపోయారు. వేసవి ముగిసే సమయానికి పరిస్థితి మరింత దారుణంగా మారేలా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎండిన వాగులు..**

మండలంలోని మేడిపూర్, ఆకునెల్లికుదురు, పాల్మూరు, గుట్టలపల్లి, పాపగల్, శిర్సవాడ, గోవిందాయిపల్లి గ్రామాలను అనుసరించుకొని పారుతున్న దుందుబి వాగు ఎండిపోయాయి. పూర్తిస్థాయిలో నీటిమట్టం పడిపోయాయి. దీంతో వాగును అనుసరించుకొని ఉన్న పొలాల రైతులు నిరాశకు గురవుతున్నారు.

**రెండు బోర్లు ఎండిపోయాయి**



గతంలో రెండు బోర్లలలో పుష్కలంగా నీరు వచ్చేది. ప్రస్తుతం భూగర్భజలాలు అడగంటిపోవడంతో నీరు రావడం లేదు. ఉన్న రెండు బోర్లు ఎండిపోయాయి. నాలుగు ఎకరాలలో వరిసాగు, వేరుశనగ పంటలు సాగుచేశాను. ప్రస్తుతం పంటలు వాడుదశలో ఉన్నాయి. కేఎల్ఐ కాల్వలలో కూడా నీరు లేదు.

– నిరంజన్, రైతు, అల్లాపూర్

**నష్టపరిహారం ఇవ్వాలి**



నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయి. గతంలో నీరు పుష్కలంగా ఉండేది. ప్రస్తుతం నీరు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి బాధిత రైతులను ఆదుకోవాలి. పంట నష్ట పరిహారం ఇవ్వాలి. రైతులు దిక్కుతోచనిస్థితిలో ఉన్నారు. కనీసం పెట్టుబడి కూడా రావడం లేదు.

– యాదయ్య, రైతు, అంతారం

# రైతు రుణమాఫీ చేసి తీరుతాం



బాణాలలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



చారకొండ మండలం జూపల్లిలో ప్రచారం చేస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్య

బల్మూర్: సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15 రైతు రుణమాఫీకి కట్టుబడి ఉన్నారని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మండలంలోని పోలిశెట్టిపల్లి, తోడెళ్లగడ్డ, రామాజీపల్లి, వీరంరాజ్‌పల్లి, బాణాల గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవికి మద్దతుగా విస్తృతంగా ఎన్నిక ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, మోపతయ్య, గిరివర్ధన్‌గౌడ్, అవుల తిరుపతయ్య, నర్సింగ్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతును ఇస్తున్నట్లు ఆ సంఘం జిల్లా నాయకులు కాశ్ల నిరంజన్, కుంభం మల్లేష్‌గౌడ్ ప్రకటించారు. సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు.

నాగర్‌కర్నూల్ క్రైం: కాంగ్రెస్‌తోనే ముస్లింల సంక్షేమం సాధ్యమని పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ లు మాక్సూద్, హబీబ్ ఉర్ రహ్మాన్‌లు అన్నారు. జిల్లా కేంద్రంలో కరపత్రాలను పంపిణీ చేశారు.

కల్వకుర్తిరూరల్: కల్వకుర్తి, ఎంగంపల్లి గ్రామాల్లో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి ఉపాధి కూలీలను కలిసి మల్లురవికి అండగా నిలవాలని కోరారు.

వెల్దండ: మండలంలోని కొట్రలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ ఇంటింటి ప్రచారం చేశారు. రాహుల్‌గాంధిని ప్రధాని చేద్దామని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, పర్వత్‌రెడ్డి, భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, జయప్రకాష్, తదితరులు ఉన్నారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని చంద్రకల్‌లో మండల అధ్యక్షుడు కృష్ణయ్య, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రావులు ఇంటింటికి వెళ్లి హస్తం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్ట, మాధవస్వామినగర్ గ్రామాల్లో మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి మల్లురవిని ఆశీర్వదించాలని కోరారు.

మన్ననూర్: వేణుగోపాల స్వామి ఆలయంలో ఎంపీగా మల్లురవి గెలుపొందాలని, ప్రధాని రాహుల్ గాంధీ కావాలని ఆ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా నాయకులు రేణయ్య, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని జూపల్లి, తుర్కపల్లి గ్రామాల్లో నాగర్‌కర్నూల్ డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్య యాదవ్ ప్రచారం చేపట్టారు.

### విద్యుత్ కోతలతో ఇక్కట్లు

ఉప్పునుంతల: మండల కేంద్రంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కాంసానిపల్లి ఫీడర్ పరిధిలో తరచుగా విద్యుత్ కోతలు విధించడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంసానిపల్లి, తిర్మలాపూర్, గట్టుకాడిపల్లి, కాంసానిపల్లి తండా, రంగంపేట గ్రామాలకు తరుచుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. స్తంభాలు, తీగలు శిథిలావస్థకు చేరడంతో చిన్నపాటి గాలికి వచ్చినా అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రతతో ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో వినియోగదారులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కరెంట్ సరఫరాలో కోతలు లేకుండ చూడాలని ఆయా గ్రామాల వినియోగదారులు కోరుతున్నారు.

### శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



పెంట్లవెల్లి: మండల కేంద్రంలో వేసవికాలం సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా యువజన క్రీడాశాఖ వారి ఆధర్యంలో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్, తైక్వాండో వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం కోచ్ రామకృష్ణ ప్రారంభించారు. యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### పోలింగ్ బూతులు పరిశీలించిన డీఎస్పీ



పెంట్లవెల్లి: మండల కేంద్రంతో పాటు జటప్రోల్, గోపులాపూర్, కొండూరు గ్రామాల్లో పోలింగ్ బూతులను శుక్రవారం నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్, ఎస్‌ఐ రామన్‌గౌడ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గా పోలింగ్ బూతులను సందర్శించినట్లు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయా ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాల తనిఖీలు కట్టుదిట్టం చేశామన్నారు. అనంతరం పోలీసు సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

### అతుల్‌కుమార్‌అంజన్‌కు ఘన నివాళి



నాగర్‌కర్నూల్‌రూరల్: సీపీఐ జాతీయ కార్యదర్శి, జాతీయ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అతుల్‌కుమార్‌అంజన్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. జిల్లా కేంద్రంలో సీపీఐ పార్టీ కార్యాలయంలో జాతీయ కార్యదర్శి ఆర్ నారాయణ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక నల్లచట్టాలను రద్దు చేయాలని అంజన్‌కుమార్‌యాదవ్ నేతృత్వంలో అనేక పోరాటాలు నిర్వహించారని ఆయన పోరాటాల ఫలితంగా కేంద్రం తలొగ్గి నల్లచట్టాలను రద్దు చేసిందని గుర్తు చేశారు. ఆయన మృతి జాతీయ స్థాయిలో పార్టీకి తీరని లోటు అన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల్‌నర్సింహ, రాష్ట్ర సమితి సభ్యుడు ఆనంద్ జీ, కేశవులుగౌడ్, వార్లవెంకటయ్య, హెచ్‌ఎండీ ఫయాజ్, నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయం



ఉప్పునుంతలలో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు



కమ్మరెడ్డిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి

కొల్లాపూర్ రూరల్: నాగర్ కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చింతలపల్లిలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల దగ్గరకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తెలకపల్లి: మండలంలోని గౌరెడ్డిపల్లి, కమ్మరెడ్డిపల్లి గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఆర్‌ఎస్పీకి ఆశీర్వదించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని 19వ వార్డులో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కౌన్సిలర్లు రమేష్‌రావు, నాయకులు శంకర్ మాదిగ, శ్రీనువాస్‌గౌడ్, శ్రీను, హరీష్, రాకేష్ పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఇంటింటికి వెళ్లి గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ నవీన్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు, నాయకులు గోపాల్‌రెడ్డి, శ్రీను, బాలునాయక్, ఎల్లయ్యయాదవ్, చిన జంగయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల, అగ్రహారం తండాలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాతం శ్రీను, నాయకులు రాంలాల్, పసుల శ్రీను తదితరులు ఉన్నారు.

### రాహుల్ గాంధీ సభను విజయవంతం చేయండి



అచ్చంపేట రూరల్: నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి గెలుపు కోసం యూత్ కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాము పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో యూత్ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఈనెల 5న గద్వాల జిల్లా ఎర్రవల్లి చౌరస్తాలో నిర్వహించే రాహుల్‌గాంధీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో పార్టీ గెలుపు కోసం యూత్ కాంగ్రెస్ నాయకులు అహర్నిషలు కృషి చేశారని, పార్లమెంట్ ఎన్నికల్లో అదే ఊపుతో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెల్టూరి రేణయ్య, ఖాదర్, హరీష్, లక్ష్మన్, దశరథం, మహేష్, శివ పాల్గొన్నారు.

# పోస్టల్ ఓటింగ్ ప్రారంభం



తహసీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్లు అందజేస్తున్న అధికారులు

కొల్లాపూర్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో పోస్టల్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. నియోజకవర్గంలోని 7 మండలాల్లో మొత్తం 1,236 పోస్టల్ బ్యాలెట్లు ఉన్నాయి. శుక్రవారం నుంచి ఈనెల 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ల ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్లు ఉన్న ఉద్యోగులు తహసీల్దార్ కార్యాలయంలోని బ్యాలెట్ బాక్సులో సీక్రెట్ ఓటింగ్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అదేవిధంగా నియోజకవర్గంలో 85 ఏళ్లు పైబడ్డ వృద్ధులు 42 మందికి ఇంటిదగ్గరే ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. శనివారం వీరికి ఓటింగ్ ప్రక్రియ సాగుతుందన్నారు. ఎవరైనా అందుబాటులో లేకుంటే సోమవారం ఓటింగ్ చేపడతామన్నారు. సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీతోనే పేదల సంక్షేమం



అచ్చంపేటలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



కల్వకుర్తిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

అచ్చంపేట రూరల్: బీజేపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని జిల్లా అధ్యక్షుడు సుధాకర్ రావు అన్నారు. శుక్రవారం పట్టణంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ప్రపంచస్థాయిలో దేశ ఖ్యాతిని పెంచిన ఘనత ప్రధాని మోడీ దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంగ్యానాయక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మండికారి బాలాజీ, అసెంబ్లీ కన్వీనర్ మొక్తాల రేణయ్య, జానకి, రవీందర్, తేజస్విని, సునీతాచారి, రాజు, రాము, లక్ష్మీకాంత్, శ్రీనివాసులు, కొండల్‌గౌడ్ పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు ఓటు వేసి ప్రధాని నరేంద్రమోదీకి అండగా నిలుద్దామని బీజేపీ రాష్ట్ర నాయకుడు గుర్రాల రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలో పలు వార్డులలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. రాఘవేందర్‌గౌడ్, గంగాధరాచారి, రాజుసాగర్, గణేష్, సాయిచరన్ పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు శేఖర్ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలని పట్టణ ఓటర్లను అభ్యర్థించారు. ఎమ్మార్పీఎస్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బిజినేపల్లి: మండలంలోని అప్పాజిపల్లిలో తిమ్మాజిపేట బీజేపీ మండల అధ్యక్షుడు యశ్వంత్ ఉపాధి కూలీలతో సమావేశమై బీజేపీకి ఓటేయాలని కూలీలను వేడుకున్నారు. బాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని గౌరారంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. మండల అధ్యక్షుడు గన్నోజు నరేంద్రాచారి, భీమయ్య, వెంకటేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండలంలోని దేవదారికుంటతండాలో ఉపాధి పనుల వద్ద బీజేపీ జిల్లా కార్యదర్శి ఇస్లావత్ శ్రీనునాయక్ ఎన్నికల ప్రచారం చేశారు. ఇస్లావత్ సురేష్, సాయికుమార్ పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలో పోలింగ్ బూత్ అధ్యక్షులతో మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు ఆచారి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బీజేపీ కన్వీనర్ శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు యాదగిరి, బాలస్వామి, మోహన్‌రెడ్డి ఉన్నారు.

లింగాల: మండలంలోని కోమటికుంట, లింగాలలో నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. వెంకటొశెట్టి, నవీన్, సలేశ్వరం, విష్ణు పాల్గొన్నారు.

అమ్రాబాద్: మండలంలోని మాధవానిపల్లిలో బీజేపీ సంక్షేమ పథకాలను వివరించారు. జిల్లా కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు, మండల అధ్యక్షుడు గోలి రాజు, బీజేవైఎం జిల్లా నాయకులు శ్రీనివాసులు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

### బీజేవైఎం కో కన్వీనర్‌గా రాజశేఖర్

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన మాయని రాజశేఖర్ నియోజకవర్గ బీజేవైఎం కో కన్వీనర్‌గా నియామకమయ్యారు. ఈ సందర్భంగా రాజశేఖర్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. తన నియామానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆచారి, అభిలాష్‌రెడ్డితోపాటు పలువురికి కృతజ్ఞతలు తెలిపారు.

### ఘనంగా సయ్యద్ సద్రుద్దీన్ షా ఉర్సు



నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని నాగనూల రోడ్డులో ఉన్న సయ్యద్ సద్రుద్దీన్ షా ఖాద్రీ రహమతుల్లా అలే ఉర్సులో గురువారం అర్ధరాత్రి గంధోత్సవం నిర్వహించారు. దర్గా ముతవల్లి షేక్ ఫహీమొద్దీన్ చిస్తిఉల్ ఖాద్రీ ఆధ్వర్యంలో మహబూబ్ సుభాని వీధిలోని షేక్ నిరంజన్ నివాసం నుంచి గంధంను ర్యాలీగా దర్గా వద్దకు తీసుకొచ్చారు. అనంతరం దర్గా వద్ద ఖవ్వాలి ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆదివారం దర్గా వద్ద చిరాగా (దీపోత్సవం)తో పాటు ఖతమే ఖురాన్ ఇతర ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

లింగాల: లింగాలకు సమీపంలోని తెలకపల్లి వెళ్లే మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. లింగాల నుంచి అటుగా వెళ్తున్న జీప్ అదుపు తప్పి పార్వతీ దేవి మిట్ట దగ్గర ఉన్న విద్యుత్ స్తంభానికి బలంగా ఢీ కొన్నది. ఈ ప్రమాదంలో జీపు డ్రైవర్ రాజు కు ఎడమ కాలు విరుగగా, మరో వ్యక్తి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

### బాధితులకు ఫోన్లు అందజేత



చారకొండ: మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరికి గురైన, పోగొట్టుకున్న ఆరు సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నవారు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది అంజనేయులు, హరిలాల్, మల్లేష్లు నూతన టెక్నాలజీని వినియోగించుకొని బాధితుల ఫోన్‌లో రికవరీ చేశారు. సీఐ విష్ణువర్ధన్ రెడ్డి పోలీస్‌సిబ్బందిని అభినందించారు. శుక్రవారం బాధితులకు సమాచారం అందించి ఫోన్లు అందజేశారు.

### ఇంట్లో చోరీ

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరులో గురువారం రాత్రి బూరం నరేష్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. రాత్రి భోజనం చేసిన తర్వాత నరేష్ భార్య అనూష, పిల్లలతో కలిసి ఇంటిపై నిద్రించారు. శుక్రవారం తెల్లవారు జామున కిందకుదిగి చూడగా ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లో దొంగలు పడినట్లు గుర్తించారు. బీరువా తాళం విరగ్గొట్టి మూడు తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి కడియాలతో పాటు రూ.50 వేలు ఎత్తుకెళ్లారు. పక్కనే ఉన్న కుమ్మరి రాములమ్మ ఇంట్లో కూడా చోరీకి యత్నించగా ఏమీ దొరకలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు సేకరించామని.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

# పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాము

పాన్‌గల్: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని బుసిరెడ్డిపల్లిలో కార్మికులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఆరు నెలలుగా వేతనాలు అందక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రెగ్యూలర్‌గా వేతనాలు చెల్లిస్తామని చెప్పిన హామీలు అమలు కావడం లేదని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు నెలలో మొదటి రోజు వేతనాలు చెల్లిస్తుందని గొప్పలు చెబుతున్నా ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఆరు నెలలు కావస్తున్నా వేతనాలు చెల్లించక పోవడం దారుణం అన్నారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలని, ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు అందించాలని, కాంట్రాక్టు విధానం రద్దు చేసి రెగ్యులరైజ్ చేయాలని, విధి నిర్వహణలో మరణించే కార్మికుల కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ ప్రమాద బీమా, ఇన్సూరెన్స్ తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించకపోతే కార్మికులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.